2 28098701

# ప్రబోధ 24

సకల వేదాంత గ్రంథాల సారమెల్ల
ఒక్క వాక్యాన చెప్పుదు నొక్కసారి.
సర్వ జీవుల యందున్న ఆత్మనేను
ఒక్కటే యని మనమున యెంచరయ్యా

దివ్యాత్మస్వరూపులారా!

మంత్రద్రష్టలైన మహర్షులచే ఆవిష్కరింపబడిన సత్యవాక్య సమూహమే వేదము. భూత భవిష్యత్ వర్తమానమునందు తిరుగులేని సత్యాన్ని ఆవిష్కరింపచేసినదే వేదము. త్రిలోకములకు యోగక్షేమమునందించి సమాజములో అవసరమైన విజ్ఞానము, శాంతిని నెలకొల్పునదే వేదము. పరమపురుషుని ఉచ్ఛ్వాస నిశ్వాసములే వేదము. ఇది విత్ అనే ధాతువునుండి ఉద్భవించినది. విత్ అనగా జ్ఞానము. జ్ఞానమయమైనదే వేదము. అనంతమైనది వేదము అనంతో వై వేదాః అని. జ్ఞానము కూడను అనంతమైనది.

ఇట్టి అనంతమైన వేదమును సామాన్యమానవులు అధ్యయనము చేసి దానిని పూర్తిగా అభ్యసించటము కష్టతరమైన విషయము. ఇంత పెద్ద వేదమును అధ్యయనము చేయుటకు కాలము కూడను అధికముగా పడుతుంది. అందువలన సామాన్యమైన మానవుడు వేదాధ్యయనము చేయుటకు యే మాత్రము పూనుకొనడు. ఇట్టి సత్యాన్ని గుర్తించిన వ్యాసమహర్షి యీ వేదమును నాలుగు భాగములుగా విభజించి ఋక్కులన్నియు వేరు చేసి ఋక్ సంహిత అని పేరు పెట్టాడు. ఈ అనంతమైన వేదమునుండి యజస్సునంత వేరు జేసి యజుస్సంహిత అని పేరు పెట్టాడు. సామమునంత వేరు చేసి దానిని సామసంహిత అని పేరు పెట్టాడు. అధర్వణ మంత్రములను వేరు చేసి దానికి అథర్వణ వేదమని పేరు పెట్టాడు. అయితే యీ అన్నింటి యొక్క మూలాధార తత్వాన్ని జగత్తునకు వ్యాపింపజేయుటకై చాటుటకే అనేకరకములుగా యీ మాదిరి విభజిస్తూ వచ్చాడు.

ఒక్కొక్క సంహితను మూడు భాగములుగా విభజిస్తూ వచ్చాడు. దీనిని బ్రాహ్మణమని, అరణ్యకములని, ఉపనిషత్తులని. ఈ బ్రాహ్మణములనగా మంత్రస్వరూపములు మంత్రస్వభావములు జగత్తునకందించి యిందులో వుండిన యజ్ఞయాగాది క్రతువులకు తగిన మంత్రములు నిరూపిస్తూ వచ్చాడు. ఇందులో ఐతరేయ బ్రాహ్మణం, కౌశతకి బ్రాహ్మణం, శతపథ బ్రాహ్మణం, గోపథ బ్రాహ్మణం అని నాలుగు రీతులుగా విభజించాడు. ఇది కేవలము యజ్ఞ

228098702

యాగాదిక్రతువులయందు వుచ్ఛరించే మంత్రస్వరూపములు. రెండవదైన బ్రాహ్మణము గద్యపద్యసహితమైనది. ఇందులో కర్మభాగము యెక్కువగా వుంటుంది. మానవుడు గృహస్థాశ్రమము ముత్తడించి వానప్రస్థములో ప్రవేశించి, వానప్రస్థుడు అరణ్యములో ప్రవేశించి అధ్యయనం చేయటం చేత దీనికి అరణ్యకమని పేరువచ్చింది. ఇందులో నేచి వరిభాగమునకు బ్రాహ్మణమని పేరుపెట్టారు. ఇదికేవలం ధర్మమార్గమును అధికముగా ప్రభోధిస్తూ యజ్ఞయాగాది స్వరూపాన్ని నిరూపిస్తూ వచ్చింది.

మూడవది ఉపనిషత్తు. ఇది నిత్యజీవితములో ప్రతిమానవుడు ధర్మార్థకామ మోక్షముల నిమిత్తమై ఆచరించ తగినవిగా దీనికి కొన్ని మార్గములు నియమిస్తూ వచ్చారు. అయితే దీనిని విద్యావివేకముల ద్వారానే ఒక ఉపనిషత్తును పొందటానికి సాధ్యమవుతుంది. ఈ విద్యలయందు రెండురకములైన విద్యలు కలవు. ఒకటి పరవిద్య. రెండవది అపరవిద్య. వేదములన్నియు కేవలం అపరవిద్యలను మాత్రమే బోధిస్తూ వచ్చాయి. ధర్మార్థ కామములను మాత్రమే వివరించాయి. తదుపరి మోక్షమునకు సరైన మార్గము తనస్వప్రయత్నమే అనేది గుర్తించటానికి ప్రయత్నించారు.

వేదములు నకర్మణా నప్రజయా త్యాగేనైకే అమృతత్వమానసుః. ఈ త్యాగము చేతనే యీ అమృతత్వమనే మోక్షము ప్రాప్తిస్తుందని, త్యాగము లేకుండా యీ విధమైన స్థానము పొందలేరని నిరూపిస్తూ వచ్చింది. కనుక వేదములు పురుషార్థములైన మూడింటిని మాత్రమే చక్కగా ప్రభోధిస్తూ వచ్చింది. నాల్గవదైన మోక్షం మానవుడు దైవానుగ్రహం చేతను, మానవుని యొక్క సాధనల చేతను యిది లభ్యమౌతుంది. ఈ జగమునకు ఐహికము, ఆధ్యాత్మికము రెండింటి యొక్క తత్త్వము అత్యవసరము. 'ఇహమును సుఖింప హేమతారక విద్య, పరమును సుఖింప బ్రహ్మవిద్య అన్నారు. జీవనోపాధి ఒకటి. జీవిత పరమావధి మరొకటి. జీవనోపాధి నిమిత్తమై యేర్పడిన తత్త్వములు ప్రబోధిస్తూ వచ్చాయి వేదములు. ఇష్టమును నెరవేర్చుకొనుటకు, అయిష్టమును దూరము గావించుకొనుటకు తగిన ఉపాయములు ప్రబోధిస్తూ వస్తున్నవి వేదములు. ఇది ప్రాచీనకాలము నుండి గురుశిష్యపరంపరగా అభివృద్ధిగాంచుతూ వచ్చింది.

వేదమునకు తొమ్మిది పేర్లు కలవు. శృతి, అనుశృతి, త్రయి, ఆమ్నాయం, సమామ్నాయం, ఛందస్సు, స్వాధ్యాయం, ఆగమం, నిగమం. వీటి లక్షణాన్ని చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి. శృతి. గురువు వుచ్ఛరించే పదములను శ్రద్ధాభక్తులతో తాను ఉచ్ఛరించి గురువు యేవిధములైన శబ్దములను వుచ్ఛరించాడో అదే విధముగా తాను శ్రవణించేసి వుచ్ఛరించే స్థితికి శృతి అని పేరు పెట్టారు. అనగా వినికిడి చేత తాను గురువు వుచ్ఛరించినట్టే తాను కూడను వుచ్ఛరించి ఆ వేదమును అధ్యయనం చేయటం చేతనే యిది శృతి, అనుశృతి అని పేరు. వేదము అనంతమై ఒక్కటిగానే వుండేది. తదుపరి మూడుగా మాత్రము విభజిస్తూ వచ్చారు. అదే ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము. ఈ మూడు మాత్రమే జగత్తులో వ్యాపిస్తూ వచ్చాయి. కనుకనే త్రయి అని మూడు వేదముల యొక్క స్వరూపమనే రీతిగా సరైన పేరు వచ్చింది. మ్నా అనే ధాతువుకు అభ్యాసము అనికూడ

229098703.

అర్థము. ఆమ్నాయమనగా అభ్యాసము చేత అధ్యయనం గావించుటచేత దీనికి ఆమ్నాయమని పేరు వచ్చింది. సామవేదము ఛందోబద్ధమైనందున దీనికి ఛందస్సు అని మరో పేరు వచ్చింది. ఇది పరంపరగా అనగా తండ్రి బిడ్డల పరంపర, వంశపరంపరగా దీనిని అధ్యయనము చేసుకుంటూ రావటంచేత అధ్యాయమని పేరు వచ్చింది. ఈ ఆగమ, నిగమములనేవి భగవంతుని ఉచ్ఛ్వాసనిశ్వాసములుగా వుండుటచేతనే దీనికి ఆగమ నిగమములని మరో పేరు వచ్చింది.

దేశకాలపరిస్థితుల ప్రభావమును అనుసరించి, యీ యొక్క అధ్యయమును అనుసరించి దాని మర్మములను సక్రమమైన మార్గములో అనుసరించటమే యీ వేదములకు యీ విధమైన పేర్లు లభిస్తూ వచ్చాయి. ఇట్టి పవిత్రమైన వేదములు అనాది కాలము నుండి భారతదేశమును సంరక్షిస్తూ వస్తున్నాయి. ఇది కేవలం పారాయణము చేయవలసినటువంటివి మాత్రమే కాదు. అర్థమును గుర్తించి దానిని ఆచరించి, అనుష్ఠానమునందించి ఆనందించవలసినది వేదము. అప్పుడే అధ్యాయము చేసిన వానికి తగిన ఆనందం ప్రాప్తిస్తుంది. అర్థము తెలియక పారాయణ చేయటంచేత కొంతవరకు ఆనందం లభ్యం కావచ్చు. కాలమును పవిత్రము చేసినవాడు కావచ్చు. అర్థము తెలిసి పారాయణ చేసినవాని జీవితం సార్థకమవుతుంది. కానీ దురదృష్టవశాత్తు యీనాడు భారతదేశంలో యీ పవిత్రమైన, దైవస్వరూపమైన వేదములకు అర్థము తెల్పినటువంటి వ్యక్తులు కరువైపోయారు.

వేదములందుండే శబ్దములకు యనేక అర్థములుంటున్నాయి. అయితే యెవరికి తగిన అర్థములు వారు స్వీకరించి వారి వారి అనుగుణ్యంగా దీనిని బోధిస్తూ వస్తున్నారు. అందుకోసమే నారదుడు సనత్కుమారుని ప్రార్థించినప్పుడు నాయనా యిది ఒక విధమైన, భయంకరమైన అరణ్యము యీ వేదశాస్త్రములు. ఏదో దారి తప్పి నడచిన చాలా ప్రమాదము సంభవిస్తుంది. వేదమంత్రములకు అనేక అర్థములుంటున్నవి. ఒక్కొక్క శబ్దమునకు యనేక అర్థములు వుంటున్నవి. నీవు యెట్టి అర్థమును స్వీకరింతువో కనుక యిది చాలా దుర్లభమైనది. చాలా కష్టమైనది. ఈ విధమైన బాధలను నీవు సురికాక భగవత్ భక్తిని అభివృద్ధిగావించుకొని అందులోనే తన్మయత్వుడై, ఉన్మత్తుడై, ముక్తుడై, తాదాత్మ్యభావమును పొందమని బోధించాడు. అప్పుడే నారదుడు ఒక భక్తిసూత్రమును ప్రారంభించాడు. దీనికే నారద భక్తిసూత్రములని పేరు వచ్చింది. సనత్కుమారుని ప్రబోధల చేత నారదుడు నూతనమైన భావమును గ్రహించాడు.

పురుషార్థములు నాలుగే. కాని దైవప్రేమ అనేది తాను ఐదవదిగా బోధిస్తూ వచ్చాడు. ధర్మార్థకామమోక్షములే కాక పరమ పురుషార్థమనేది మోక్షముకంటె అధికమైనదని తాను విశ్వసిస్తూ వచ్చాడు. మోక్షమనగా కేవలము మోహమును క్షయము గావించుకోటం. ఇంత మాత్రం చేత మోక్షమనే దానిలో ఆనందం మనకు కనుపించదు. నిరంతరం భగవంతునితోనే కూడి ఆడి ఆనందంగా తాదాత్మ్యభావాన్ని పొందటమే పరమప్రేమగా భావిస్తూ వచ్చాడు నారదుడు. ఈ పరమప్రేమ కూడను వేదసారముగానే భావిస్తూ వచ్చాడు. కనుకే వేదముల యొక్క విషయము

229098704

చెప్పుటకుగాని, అధ్యయనం చేయుటకాని చాలకష్టము. భగవత్ భావములను వర్ణించటం అనేది చాలా దుర్లభము. దీనిస్థాయికి, ఆ వేదముల యొక్క స్థాయికి సన్నిహిత సంబంధ బాంధవ్యం చాలా కష్టం. కనుకనే ప్రాచీన కాలము నుండి యీ వేదాధ్యయనం క్రమక్రమేణా సన్నగిల్లిపోవటం చేతనే యీనాడు వుండవలసిన స్వరూపాన్ని మనం వుంచుకోలేకపోతున్నాము.

ఈ వేదమునకు అనేక శాఖలు వుండేవి. ఋగ్వేదమునకు ప్రధానమైన శాఖలు 21. ఇంక ఉపశాఖలు అనేకంగా వుంటున్నాయి. కానీ యీనాడు మనము మన భారతదేశములో చూస్తే యీ ఋగ్వేదములో రెండు శాఖలు మాత్రమే మిగిలి వుంటున్నాయి. 19 శాఖలు యొక్క జాడ కన్పించటం లేదు. కాలగర్భములో కలిసిపోయాయి. యజుర్వేదములో ప్రధానమైన శాఖలు 86 వుండేవి. ఈనాడు 4 శాఖలు మాత్రమే వుంటున్నాయి. సామవేదంలో 1000 శాఖలుండేవి ప్రధానమైనవి. కానీ సామవేదములో కూడను యీనాడు మూడు మాత్రమే నిలిచి వున్నవి. అదే విధముగా అథర్వణ వేదములో కూడను 9 ప్రధానమైన శాఖలుండేవి. కానీ రెండు మాత్రమే నిలచినవి.

ఈ విధముగా అల్పసంఖ్యలో వున్న వేదము తే అనంతమైన అర్థాన్ని బోధిస్తుండగా యింక అనంతమైన వేదముల అన్నిశాఖలు వుండి వుంటే యెంత పవిత్రమైనదానిని బోధించి వుండేవో. కాని యీనాడు వుండిన రెండు, మూడు, నాల్గు శాఖలు కూడను యెంత కాలము మనము నిల్పకుంటామో చెప్పటానికి వీలుకాదు. ఈనాడు వేదాధ్యయనము చేసే వ్యక్తులు చాలా అరుదైపోయినారు. ఈనాడు వేదాధ్యయనం కూడను ఒక వ్యాపార రంగముగా తయారైనది. కనుకనే క్రమక్రమేణా వున్న శాఖలు కూడను కోల్పోవలసి వస్తుంది. వేదములు జగత్తునకు ప్రాణములు అనే సత్యాన్ని వీరు విస్మరిస్తూ పోతున్నారు. సమస్త వేదములకు మాతయైన గాయత్రి తత్వాన్ని విస్మరిస్తూ వస్తున్నారు. గాయత్రిని ఛందసాం మాతః అన్నారు. అనగా ఛందస్సునకంతా తల్లివంటిది.

ఈనాడు వేదాధ్యయనము గావించిన వ్యక్తులు తాము తమ సంతతికి కాని, తోటి మానవులకు కాని బోధించటానికి వెనుకంజ వేస్తున్నారు. ఈ విధముగా వంశపరంపరగా వస్తున్న వేదములు యీనాడు వ్యాప్తి కాకుండా నిలచిపోవటంచేతనే వేదము క్షీణిస్తూ వస్తున్నది. ఒక చిన్న ఉదాహరణము. ఘుండి కోట సుబ్రహ్మణ్య శాస్త్రిగారని పరమ భక్తుడు. వేదపురుషుడనే చెప్పవచ్చును. వేదార్థములనేవి అతనికి త్రాగునీరువలె సులభముగా వుండేది. గుర్తించేవాడు వానిప్రకారము వర్తించేవాడు. కానీ అతను గతించిన తక్షణమే యీ వేదమంతా అంతర్థానమై పోయింది. తన యింటిలో వేదమువుచ్చరించే వ్యక్తే లేకపోతున్నాడు. తన సంతతి అంతయు ఆంగ్లవిద్యా దాసత్వము పొందటంచేత యీ వేదమును క్రమక్రమేణా మరచిపోతూ వస్తున్నారు. ధనార్జనే ప్రధానమైన లక్ష్యముగా వుంచుకోటంచేత యీ పవిత్రమైన వేదధనాన్ని మనము కోల్పోతున్నాము. తాను యెంత గొప్ప వేదపండితుడైనప్పటికిని తనకుమారులలో ఒక్కరైనను కూడను వేదమునభ్యసించినవారు లేరు. తన మనుమలు తెలుగు రానటువంటి వారుగా వుంటున్నారు. అదే విధముగనే వేదములు గంటపాఠ

228098705

పైగ తూపుంటూయు కామావధాని నోటిలో వేదాన్ని ఉచ్చరించి, అధ్యయనం చేసిన కామావధాని యింటిలో ఒక్కను మారుడైనా వేదాన్ని పఠించువాడు లేడు. ఈ విధముగా తమ పుత్రులకే తాము బోధించకుండా వుండటంచేత పబ్లిక్ లోపల ఒకవిధమైన అవిశ్వాసము బయలుదేరుతూ వచ్చింది. వేదమే యింత మహత్తరమైనదైతే తమ పుత్రులకు తాము యెందుకు బోధించకూడదు. కనుక యేదో యిది వ్యాపారరంగముగా ప్రయోగపెట్టటంచేత యేవిధమైన మహాత్మ్యము లేదని ప్రపంచములో అభివృద్ధిగాంచుతూవస్తున్నది ఈనాడు యిట్టి అపోహలు మనము ఖండించి వేదము మహత్తరమైనది, వేదమే సర్వము, వేదమే పరమాత్మస్వరూపము అనే సత్యాన్ని మనము చాటుతూరావాలి.

భారతీయుల యొక్క ప్రతి కర్మ వేదములకు సంబంధించినవే. వేదసంబంధమైన కర్మలు ఆచరించినప్పుడే వారిలో వున్న వేదన దూరమై ఆనందమును అనుభవించగలము. వేదాన్ని గురించి వర్ణిస్తూ బోధిస్తూ దాని ఘనతను, దాని మహిమను అనేకరీతులుగా చాటుతున్నారు వారికే అవిశ్వాసము లేకపోతున్నది. ఈ వేదము చిత్తశుద్ధిగావించుకొనే నిమిత్తమై యేర్పడిన పవిత్రమైన కృత్యములుగా మనము విశ్వసించాలి.

వేదవేదాంగములు వల్లెవేసియున్న
పద్యగద్యములు కూడ పలికియున్న
అంతశుద్ధియె లేకున్న చెడునువాడు.

యీవిధముగా అంతశ్శుద్ధి లేకుండా యెన్నివేదములు వల్లిస్తే లాభమేమిటి? వేదములు పవిత్రమైనప్పటికి ఉచ్ఛరించటంచేత మనకు సంప్రాప్తి కలుగదు. పంచభక్ష్యపరమాన్నములైనప్పటికి తట్టయందు వుంచుకొని పంచభక్ష్యపరమాన్నమని స్మరించినంత మాత్రమున మనపొట్ట నిండదు. యెంతవిలువైన ఔషధములైనా మనము వల్లించుకుంటూ కూర్చున్నంత మాత్రమున మన రోగము నివారణకాదు. ఎంతో ప్రకాశవంతమైన జ్యోతిని మనము చింతించుకుంటూ కూర్చున్న అంధకారం మనకు దూరం కాదు. మనం అంతో యింతో అయినా ఆచరణలో పెట్టి, దానిని అనుభవించి, ఆనందించి అన్యులకు అందించాలి. ఇంకా యితర దేశాలకు అందించటానికి ప్రయత్నించాలి.

ఈ వేదము కొందరి సొత్తుగా భావించి మనము దానిని యితరులు వల్లించటానికి అధికారము లేదని చెప్పి యీవిధమైన ప్రలోభలు సల్పటంచేత వేదము క్రమక్రమేణా ప్రతిష్ఠపోతున్నది. కనుక వేదమనే దానిని ఉచ్ఛరించకపోయినప్పటికి వేదము యొక్క అంతరార్థమును, వేదము యొక్క విశిష్టతను ప్రపంచమునకు చాటటానికి ప్రతి విప్రుడు కూడను సంసిద్ధముగా వుంటుండాలి.

తాను చెప్ప తలపు పుట్టదు కాని
ఒరుల చెప్పనీటు చూచి ఓర్వలేరు.

తాను చెప్పరు. ఒరులను చెప్పనివ్వరు. ఇంక స్వాధ్యాయనము చూస్తామా అంటే యింక అనేకరకములైన వ్యాఖ్యానములు అవలంబిస్తారు. ఇది సరైన మార్గము కాదు. ఇది సత్యమార్గము కాదు.

228098706

సత్యస్వరూపమైనది వేదము. వేదవేలేకపోతే ధర్మము యెక్కడనుండి వస్తుంది. సత్యంనాస్తి పరోధర్మః. ధర్మమనేది సత్యముపైన ఆధారపడివుంటుంది. నిత్యసత్యనిర్మలమైనది యీవేదము.

అన్నిజీవులయందున్న ఆత్మనేను
ఒక్కటేయని మదియెరుగరయ్యా

అనగా అందరియందువున్న ఆత్మ నేను ఒక్కటే. నేను అనేదే ఆత్మ. ఆత్మనేను రెండు ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించాలి. ఆత్మకు ఒక్కదానికి మాత్రమే నేను, నేను అని చెప్పటానికి అధికారముంటున్నది. అది అనంతమైనది. ఇలాంటి వేదమును యీనాడు యెందో ఒకసంకుచితమైన భావముతో దానిని వుపయోగపెట్టుకుంటున్నాము. ఈసంకుచితమైనభావాన్ని మనము ప్రక్కకు నెట్టాలి. విశాలమైనభావములు మనము పెంచుకోవాలి.

ఈ విశాలమైన జగత్తులోపల యీ వివేకవంతమైన వేదమును మనము పంచాలి. ప్రతిమానవుడు వేదమును గౌరవించాలి. నీయొక్క జీవితానికి ఆధారమే ఆ వేదము. నీ నిత్యజీవితములో చేసే సర్వకర్మలు వేదము నుండి ఆవిర్భవించినవే. మీకు తెలిసినా తెలియకపోయినా సర్వము వేదమయమే. ఆ వేదమయుడైన నారాయణుడే యజ్ఞమునందు సాక్షాత్కరిస్తున్నాడు. కనుకనే నారాయణుడు యజ్ఞస్వరూపుడు. యజ్ఞమనగా త్యాగమే. దేనిని త్యాగము చెయ్యాలి. దుర్గుణములు త్యాగము చెయ్యాలి. అహంకారమును త్యాగము చెయ్యాలి. దుశ్చింతలు త్యాగము చెయ్యాలి. దుర్మార్గమును త్యాగము చెయ్యాలి. అప్పుడే దైవత్వమనేది మనను సాక్షాత్కరిస్తుంది.

ఏమిలేని బుఱ్ఱలోన
యేమైనను చేర్చవచ్చు
ఏమేమో నిండివున్న
తలబుఱ్ఱది ఖాళీయగునా
తలబుఱ్ఱది ఖాళీ కాక
ఇలసుకృతంబు నింపనగునా.

మనము అనేక విధములైనభావముల చేత హృదయాన్ని నింపుకున్నాము. ఇక యీవేదసారమనే భావాన్ని నింపుకోవాలంటే స్థానము లేదు. కనుక యీదుర్భావములను మనము దూరము చేసి, హృదయమును ఖాళీ చేసి దానితో యీవేదసారమనే దైవత్వాన్ని మనము నింపుకోవాలి. ఇదియే దైవము అవతరించటానికి దుష్టశిక్షణ, శిష్టరక్షణ అన్నారు. అనగా దుర్మార్గులను చంపటము కాదు. దుర్మార్గమనగా మన భావములే. మనతలంపులే. వీటిని చంపాలి. చావులేని దైవమే ధర్మము. కనుకనే సద్భావములు పోషించి, దుర్భావములు దూరము చేసి సరియైన జీవితత్వాన్ని మానవత్వముగా వికసింపచేయటమే వేదము యొక్క విశిష్టత.

వేదశాస్త్రములు నియమించిన మార్గములు మనము నడుచుకొన్నప్పుడు దానిని మనస్సరీతిగా ప్రమాణపూర్వకముగా ఆచరించినప్పుడు, మానవునకు బాధలేవుండవు. కానీ యీబాధలకంతా మూలకారణము దానిని విస్మరించటము. భూమికి ఆకర్షణశక్తి ఆనాటినుండి వుంటున్నది. కాని

2280987O7

న్యూటన్ అనేవాడు దీనికి అనేక పరిశీలనలు చేసి, పరిశోధనలు చేసి భూమికి ఆకర్షణాశక్తి వున్నదని గుర్తించాడు కానీ దానికి పూర్వము కూడను యీ ఆకర్షణాశక్తి భూమికి లేకపోలేదు. అదే రీతిగా భారతదేశమందు భారతీయులు యీ వేదప్రమాణాన్ని, వేదమహత్మ్యమును పరిశోధనల ద్వారా దీనిని పరిశీలన చేశారు. పరిశోధించి పరిశీలన చేసిన వారు భారతీయులు. భారతీయులు పరిశోధించి, పరిశీలన చేయటము వలన యీ వేదము ప్రపంచమంతా వేదము అని చెప్పటానికి వీలు కాదు. ప్రపంచమంతా నిండి నిబిడీకృతమై వున్నది వేదము. ఇతర దేశములలో లేకపోవచ్చును. ఈ విధమైన పేర్లు లేకపోవచ్చును. అదే రీతిగా న్యూటన్ యే దేశము వాడో భూమికి ఆకర్షణాశక్తి వున్నదన్నప్పుడు భారతీయులు దీనిని లేదని చెప్పటానికి వీలు లేదే. అట్లే భారతీయులు పరిశోధించి పెట్టిన యీ వేదమును యితరులు లేదని చెప్పటానికి లేదు. ఇతరదేశస్థులు కూడను యీ వేదమును యెంతగానో గౌరవిస్తున్నారు. Max muller అనేవాడు యీ వేదమునకు అనేక వ్యాఖ్యానములు వ్రాసి దీని పుట్టుపూర్వోత్తరములు యెక్కడని అనేక విధములుగా పరిశీలన చేశాడు. రాత్రింబవలు అనేక విధములుగా అభ్యసిస్తూ వచ్చాడు. అధ్యయనము చేస్తూ వచ్చాడు. సరైన అర్థమును తాను గుర్తించటానికి ప్రయత్నిస్తూ వచ్చాడు. తన జీవితమంతా వేదమునకే ధారపోశాడు. కనుకనే మేక్స్‌ముల్లర్ పేరు పోయి మోక్షముల్లర్ అనే పేరు వచ్చింది. విదేశీయులకు వుండిన విశ్వాసము భారతీయులకు లేకపోతున్నది. ఇదే యీనాడు ప్రవేశించిన దురదృష్టము. ఈ దురదృష్టము యేనాడు భారతదేశములో ప్రవేశించిందో ఆనాటినుంచే నిత్యకళ్యాణ పచ్చతోరణముతో కళకళలాడుతున్న భారతదేశము, అన్నపూర్ణస్వరూపమైన భారతదేశము అన్నమో రామచంద్రా అని అల్లాడవలసి వచ్చింది.

దీని బాధ్యత అంతయు బ్రాహ్మణులదే. వారు సరైన పోషణ చేసివుంటే యీ దుర్గతి వచ్చివుండేటువంటిది కాదు. ఈ నాటికైనా వారు కన్నుతెరచి దీనిని సరైనరీతిలో పోషించటానికి ప్రయత్నము చెయ్యాలి. మా పాఠశాలల్లో ప్రైమరీస్కూలు నుండి కాలేజీ వరకు అందరు పిల్లలు వేదమునభ్యసిస్తున్నారు. ఈనాడు వుత్సాహ ప్రోత్సాహములందించే వారు లేకపోతున్నారు. దీనికి కారణము వేదాన్ని ఒక గురువర్గము చేతిలో పెట్టటము చేతనే యిట్టి దురవస్థల పాలైపోతున్నది. చెప్పటం ఒకటి చేయటం మరొకటి. కనుకనే యీ వేద విజ్ఞానము ప్రజలలో సన్నగిల్లిపోతున్నది. చెప్పినట్లుగా వారు చేయటం లేదు. కనుకనే ప్రజలలోపల యీ విశ్వాసము యే రీతిగా బలపడుతుంది.

ప్రేమస్వరూపులారా! ప్రతి వ్యక్తి కూడను యీ వేదాన్ని సరైనరీతిలో పోషించటానికి కంకణం కట్టుకోవాలి. దేశక్షేమము, లోకకళ్యాణము వేదముపైననే ఆధారపడి వుంటున్నది. కనుకనే ఎంత మాత్రమునయెవ్వరు తలచిన అంత మాత్రమే తాను అన్నారు. కలడనే విశ్వాసము కలవారికి కలడు. లేడనే విశ్వాసము వారికి లేడు. కలడు లేడనేది మనకంఠానికేగాని దైవానికి లేదు. కనుక వేదమును క్రమక్రమేణా క్షీణింపచేయటానికి యీ బ్రాహ్మణులే కారణము. ఎన్నైనా చెప్పవచ్చును. కానీ చేసి చూపించాలి. ఈ వక్తలంతా కంకణం కట్టి దీని అభివృద్ధిని పోషించటానికి తగిన కృషి చేయాలి. ఇంకా ఒక పదిసంవత్స

228098708.

రములో, ఇరువది సంవత్సరములో జరిగితే వారు కూడను దానిని నిలపటానికి సాధ్యంకాదు. ఇప్పుడే యీ వేదములకు కొంత అంటుకట్టినట్లుగా కొంత సమూహము గావించి దానికి సరైన పోషణాశక్తిని ఆర్జించి దానికి సరైన ఉత్సాహప్రోత్సాహము లందించాలి.

చెప్పవచ్చు కోటి చెయ్యరు ఒకటి
చెప్పుట సులభంబు చేయుట కష్టంబు.

ఇలాంటి పరిస్థితిలో వున్నప్పుడు యీ వేదము మహత్తరమని యెంత చెప్పియేమి ప్రయోజనము. ఈ వేదము సర్వస్వతంత్రమైనది. ఇది భగవంతునికి నీకు సన్నిహిత సంబంధ బాంధవ్యాన్ని అభివృద్ధిగావించేది ప్రజలకు నీకు సన్నిహిత బాంధవ్యాన్ని అందించేదికాదు. కనుక నే వేదము తెలిసినవ్యక్తులందరు కొంతవరకు త్యాగము గావించి, తమ జీవితాన్ని వేదానికి అర్పితము గావించాలి అప్పుడే మన ప్రాచీన భారత దేశము తిరిగి పునరుద్ధరింప చేసినవారమవుతాము. వేదహితమైన కర్మలను విసర్జిస్తున్నారు. ముట్టును, ముట్టకు అనే మూఢాచారంలో మునిగిపోతున్నారు. వేదము చెప్పినది యేమాత్రం అనుసరిస్తున్నారు ప్రాణముపోయిననూ సరే వేదము ననుసరించాలి. అలాంటి కంకణము కట్టుకున్నప్పుడే యీ వేదాన్ని మనము ప్రచారము చేయుటానికి అర్హులమవుతాము. కేవలం గొణిగినంత మాత్రమున అభివృద్ధి కాదు. దానిని నిర్భయముగా, నిస్సందేహముగా ప్రచారం సల్పటానికి పూనుకోవాలి.

సత్యానికి భయమెందుకు? అసత్యానికే భయము. వారిలో అసత్యము వుండటం చేతనే భయపడుతున్నారు. భయము ఎందుకు. ప్రాణం తీస్తారా. తీయనీ వేదాలకోసం ఈ ప్రాణాన్ని అర్పితం చేశావనేది, అది కూడను గొప్ప ఘనతగానే వుంటుంది. ఈ విధమైన దృఢ విశ్వాసము చేత వేదాన్ని పునరుద్ధరింప చేయుటానికి ప్రయత్నించేయాలి. వేదము బోధించిన దానిని ఆచరణలో పెడుతుండాలి. ఆచరణలో పెట్టిన దానిని అన్యులకందించాలి. అప్పుడే యిది క్రమక్రమేణా పెరుగుతూ వస్తుంది. ఈ విధమైన మార్గాన్ని ప్రతివ్యక్తి కూడను బాధ్యతగా భావించి దానిని పునరుద్ధరింప చేయుటానికి ప్రయత్నించయాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.